క్లుప్తంగా

నేడు మరిడమ్మతల్లి జాతర



ఎస్.అన్నవరంలోని మరిడమ్మ ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరం లక్ష్మీదేవి చెరువు వద్ద ఉన్న మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. బుధవారం రాత్రి ఆరు గంటల నుంచి గురువారం ఉదయం వరకూ జాతర మహోత్సం, 18న ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తీర్థం నిర్వహించి, అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. జాతరను పురష్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పోలరాతి చక్రరావు, కీర్తి నాగేశ్వరరావు, కోశాధికారి మోకిన సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు సూర్యుడు

ఏలేశ్వరం: యర్రవరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు మోటారుసైకిల్ వెళుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. దీంతో పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు(70) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తై ఉన్నారు. ఎస్సై సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన



జగ్గంపేటలో సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రిలో సదుపాయాలు, వైద్యులు వివరాలు, రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి వైద్యులు పూలమాలలతో, శాలువాతో జ్యోతుల నెహ్రూ సత్కరించారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్ల ఛిద్రం



తంటికొండ ప్రధాన రహదారిపై వెళుతున్న దమ్ముచక్రల ట్రాక్టర్

గోకవరం: దమ్ము ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు దమ్ములు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం దమ్ము చక్రాలను పొలంలోకి వెళ్లిన తరువాత ఏర్పాటు చేయాల్సి ఉండగా ట్రాక్టర్ యజమానులు వాటిని ఇష్టాసారంగా రోడ్లపైనే నడిపిస్తున్నారు. దీంతో పలు రహదారులు ధ్వంసమవుతున్నాయి. మండలంలోని తంటికొండ, గాదెలపాలెం, తదితర గ్రామాల్లో దమ్ము ట్రాక్టర్లు ఇష్టాసారంగా రాకపోకలు సాగించడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జోరుగా రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలు

కోటనందూరు: మండలంలో రేషన్‌బియ్యం మాఫియా కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న సుమారు 250 మంది వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై మండలంతో పాటు ఇతర మండలాల నుంచి బియ్యం కొనుగోలు చేసి రైసుమిల్లులకు తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా బియ్యం మాఫియా హల్‌చల్ చేస్తున్నా..సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా సరిహద్దు గ్రామాలైన భీమవరపుకోట, అల్లిపూడి, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరులలో బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు బియ్యం సేకరణ, అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

హరిశ్చంద్ర నాటకాలపై 21న పుస్తకావిష్కరణ

పెద్దాపురం: ఈ నెల 21వ తేదీన 'హరిశ్చంద్ర నాటకాలు-తులనాత్మక పరిశీలన' తెలుగు పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. సాహితీ స్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు రచించిన పుస్తకావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు.

అనుకూలిస్తే.. లాభాలే

- కూరగాయల సాగుతో మంచి ఆదాయం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- సుమారు 200 ఎకరాల్లో సాగు

రౌతులపూడి: మార్కెట్‌లో రోజురోజుకు పెరుగుతున్న ధరలను చూసి మండలంలోని పలువురు రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పలు గ్రామాల్లో వారికి ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు సాగు చేస్తున్నారు. భూమిని సదును చేసి కంచెలు, పందెళ్లు వేసి సాగుకు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని సుమారు 200 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నట్టు ప్రాథమిక అంచనా. మెట్టప్రాంతం కావడంతో ఇక్కడ బీర, చిక్కుడు, ఆనప, కాకర, ఆకార, దోస, గుమ్మడి, వంటి పాదుజాతుల కూరగాయల సాగు ఎక్కువగా చేపడుతున్నారు. అంతేకాకుండా బెండ, వంగ, టమాటా, పచ్చిమిర్చి, గోరుచిక్కుడు, మునగ, వంటి కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. మెట్టప్రాంతంలో వర్షాధార భూములు కావడంతో ఎక్కువగా పండించే పత్తి, పొగాకు, వంటి వాణిజ్య పంటలు చుట్టూ కూరగాయల సాగు చేస్తున్నారు. వీటికి కూరగాయల సాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వరకు పెట్టుబడి అవుతుందని, వాతావరణం అనుకూలిస్తే రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

రైతు సేవా కేంద్రాలతో..

కూరగాయలు సాగు చేపట్టే రైతులందరూ స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాలను ఉపయోగించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యానవనశాఖ కూరగాయలు దిగుబడిని పెంచడానికి కూరగాయలు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సహకాలను అందిస్తుంది



గుమ్మరేగులలో ఆకాకర సాగుకు రైతు వేసిన పందిళ్లు

ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. బిందు, తుంపర్ల సేద్యం ద్వారా కూరగాయలు సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనికోసం సూక్ష్మ నీటి వనరుల పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై పరికరాలు, బిందు సేద్యానికి అవసరమైన స్ప్రింకర్లను 50 శాతం సబ్సిడీపై



గుమ్మరేగులలో బీర,చిక్కుడు పాదులకు కంచెలు కడుతున్న రైతులు

ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాకుండా కూరగాయల ఉత్పత్తిని పెంచేందుకు, నష్టాలను నివారించేందుకు అవసరమైన శాశ్వత పందెళ్ల ఏర్పాటుకు ఒక హెక్టారుకు (2.1/2 ఎకరాలు)కు రూ.లక్ష వరకు ఆర్థిక సాయం కూడా చేస్తోంది. నాణ్యమైన టమాటా ఉత్పత్తి కోసం ట్రెల్లీస్ పద్ధతి అవలంబించి సాగు చేస్తే గరిష్టంగా హెక్టారుకు రూ.20 వేల వరకు సహాయం అందుతుంది.

సాగు చేస్తే అదనపు ఆదాయం



నాకున్న కొద్దిపాటి భూమితోపాటు 1.30 ఎకరాల భూమిని రూ.22వేల కౌలుకు తీసుకున్నాను. ఈ భూమిలో బీర, చిక్కుడు తదితర పంటలు సాగు చేశా. భూమి కౌలుకు రూ.22వేలు, కంచెలు, క్రిమిసంహారిక మందులు కొనుగోలుకు మొత్తం పెట్టబడి రూ.30 నుంచి రూ.50 వేలు అవుతుంది. మొత్తం రూ.70వేల వరకు పెట్టుబడి అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే సుమారు రెండు, మూడు లక్షలు వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతంలో 40 సెంట్లు భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసి దానిలో సుమారుగా రూ.ఐదు లక్షల వరకు ఆదాయం పొందగలిగాను. ప్రస్తుతం అంత లాభం రాకపోయినా కనీసం పెట్టుబడి పోయి రూ.లక్ష వరకు మిగులుతుందని ఆశిస్తున్నాను. సాగు సమయంలో ఉద్యానవన శాఖ అధికారులు సలహాలు, సూచనలు ఇస్తే మరింత దిగుబడిని సాధించవచ్చు.

– సామన భూషణం, గుమ్మరేగుల, కౌలు రైతు

విత్తనాల సరఫరా



మొత్తం విత్తన ఖరీదులో 50 శాతం రాయితీ లేదా హెక్టారుకు రూ.3 వేలు వరకు రాయితీ ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తుంది. పల్లెల్లో కంచెలు, పందెళ్లు వేసి హైబ్రీడ్ టమాటా సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.20 వేలు వరకు ఆర్థిక సహాయం అందిస్తోంది. రైతులంతా ఈ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. పంటలు సాగు చేసి లాభాలు పొందవచ్చు.

– పి.అరుణ్‌కుమార్, ఉద్యానవనశాఖ, అధికారి, రౌతులపూడి

కౌమారదశలో ఆకర్షణలకు గురి కావొద్దు

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

తుని రూరల్: కౌమారదశలో కలిగే ఆకర్షణలకు గురికాకుండ బాలికలు పరిపూర్ణ జ్ఞానంతో నడుచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరులోగల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. వివిధ విభాగాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థినులతో సమావేశమయ్యారు. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కోనే శక్తిలు అలవర్చుకోవాలని బాలికలకు సూచించారు. సమాజంలో ఏవిధంగా నుచుకోవాలో వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలను అవగాహనతతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌమారదశను సమర్థవంతంగా దాటాలంటూ విద్యార్థినులచే విక్టరీ చూపిస్తూ పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ అమృతవాణి పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తుని: స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో పలు అభివృద్ధి పనులకు గురువారం తుని శాసన సభ్యురాలు యనమల దివ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి శంకుస్థాపన చేస్తారని కమిషనర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మి

ప్రత్తిపాడు: మహిళలు పనిచేసే ప్రదేశాలలోని మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోస్ యాక్ట్)-2013పై మండల స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, దిద్దుబాబు) చట్టం-2013పై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో పది మంది కాని, అంతకంటే ఎక్కువ మంది మహిళలు ఉంటే ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఏర్పాటు చేసే కమిటీలకు నోడల్ అధికారిగా మండల అభివృద్ధి అధికారి వ్యవహరిస్తారని అన్నారు. ఏడాది లోపు మహిళలు లైంగిక వేధింపులకు గురైతే వారు కమిటీ సభ్యులకు, నోడల్ అధికారికి గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో ఈ చట్టంపై అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఈ చట్టంపై మరింత అవగాహన కలిగించేందుకు ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, ఐసీడీఎస్ ప్రోజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి వివరించారు. ఎంపీడీఓ ఎస్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం తదితరలు పాల్గొన్నారు.

మహిళలపై బెదిరింపులు లేని వాతావరణాన్ని కల్పిద్దాం

గండేపల్లి: మహిళలపై బెదిరింపులు లేని వాతావరణాన్ని కల్పిద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.పూర్ణిమ పిలుపునిచ్చారు. మిషన్ శక్తి వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మిషన్ శక్తి స్కీంపై గండేపల్లిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు భద్రత, రక్షణ, సాధికారత, ఆర్థిక, అక్షరాస్యత, సూక్ష్మ రుణాలు, బెదిరింపులు లేని వాతావరణంలో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ ఎస్ హనుమంతరావు, ఈఓఆర్డీ మూర్తి, సూపర్‌వైజర్ నాగపార్వతి, వైద్య సిబ్బంది, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక రాబడి



రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్, ఏఓ

శంఖవరం: చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక రాబడిని సాధించవచ్చని వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని మండపం, ఎస్.జగ్గంపేట గ్రామాల్లో సబ్సిడీపై చిరుధాన్యాల విత్తనాలు రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగులో చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరా ఉప్పారావు, టీడీపీ నాయకుడు ఓలేటి లక్ష్మీ నారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై జబీర్

కిర్లంపూడి: రోడ్డు ప్రమాదాల నివారణపై న్యాయ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడు ప్రమాదాలను నివారించవచ్చని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై షేక్ జబీర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై జబీర్ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు రోడ్డు రవాణా, న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు, హెల్మెంట్ కలిగి ఉండాలన్నారు. లైసెన్సు లేకుండా పిల్లలు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులకు కూడా శిక్షార్హులవుతారన్నారు. సర్పంచ్ సభ్యుడు గుడాల రాంబాబు తదితరులు ఉన్నారు.

సత్యదేవుని వ్రతాలకు మారేడు పత్రి

- వేసవిలో లభించని మారేడు
- రెండు నెలలుగా జమ్మి పత్రితో వ్రతాల నిర్వహణ
- వర్షాలకు చిగిరించిన చెట్లు, దేవస్థానానికి చేరుకున్న పత్రి



ఐషర్ వ్యాన్‌లో రత్నగిరికి తీసుకువచ్చిన మారేడు పత్రి

అన్నవరం: సత్యదేవుని వ్రతాలలో మారేడు పత్రి వినియోగిస్తున్నారు. వేసవి ఎండలకు మారేడు చెట్లు ఎండిపోవడంతో పత్రి కొరత ఏర్పడింది. దీంతో గత రెండు నెలలుగా మారేడు పత్రికి బదులు జమ్మి పత్రితో సత్యదేవుని వ్రతాలను నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మారేడు చెట్లు చిగిరించాయి. మళ్లీ వాటిని సేకరించి సత్యదేవుని వ్రతాలలో ఉపయోగిస్తున్నట్టు దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

సత్యదేవుని వ్రతాలకు అవసరమైన మారేడు పత్రిని విశాఖ, అల్లూరి జిల్లా మన్యం నుంచి సేకరిస్తారు. ఆ మన్యంలో విస్తారంగా ఉన్న మారేడు చెట్ల నుంచి వారానికి రెండు, మూడు సార్లు వెళ్లి అక్కడ చెట్ల నుంచి సేకరించి వాహనాల ద్వారా దేవస్థానానికి తీసుకువచ్చి కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి ఉపయోగిస్తారు. మారేడు పత్రి కొరత సమయంలో రాజానగరం తదితర ప్రాంతాల నుంచి జమ్మి పత్రి సేకరించి దేవస్థానానికి తరలించి కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి వ్రతాలలో ఉపయోగిస్తారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- ప్రశ్నలు, అభ్యంతరాలతో సభ్యుల ఆగ్రహం
- ఒంటరిగా మారిన చైర్‌పర్సన్



సమావేశంలో ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు

ఏలేశ్వరం: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. స్వపక్షంలో కౌన్సిలర్లే టీడీపీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతికి వ్యతిరేకంగా మాట్లాడారు. పలు ప్రశ్నలు, అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నగర పంచాయతీ కౌన్సిల్‌లో చాలా మంది కౌన్సిలర్లు వేర్వేరు పార్టీల్లో చేరారు. దీంతో నామమాత్రంగా ఉన్న టీడీపీ బలం కౌన్సిల్‌లో పుంజుకుంది. కాగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత అజెండా చదువుతుండగా 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ సభ్యుల అనుమతి లేకుండా అజెండా పలు తీర్మానాలు ప్రవేశపెట్టడం సరికాదన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి సంబంధించినవి కాకుండా మిగిలిన అంశాలను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, 15వ వార్డు కౌన్సిలర్ సుంకర హైమావతితో పాటు పలువురు అడ్డుకున్నారు. టీడీపీ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తే మున్సిపల్, సచివాలయ సిబ్బంది రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. మరో టీడీపీ కౌన్సిలర్ మూది నారాయణస్వామి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పత్రికలో వచ్చిందని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని నిలదీశారు. టీడీపీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ అలమండ చలమయ్య కల్పించుకోగా నారాయణస్వామి, చలమయ్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సమావేశం ప్రారంభం నుంచి వాడీవేగాగా జరిగింది. సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ కె.శివప్రసాద్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం సమావేశం ముగిసింది. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు ఎదురుదెబ్బ

చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, ఆమె భర్త కౌన్సిలర్ అలమండ చలమయ్యకు సమావేశంలో ఎదురుదెబ్బ తగిలింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు చలమయ్య ఒక్కరే సమాధానాలు చెప్పడం అతనికి ఎవ్వరూ మద్దతు తెలపకపోవడం విశేషం. కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లవుతున్నా ఇప్పటివరకు తన భర్త మినహా ఒక్క సభ్యుడు చైర్‌పర్సన్‌కు మద్దతు లేకపోవడం గమనార్హం. ఎవరూ తీసిన గోతిలో వారే పడినట్టుగా వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలోకి వెళ్లినా రెండుచోట్ల తమ మద్దతు లేకపోవడంతో చైర్‌పర్సన్ పరిస్థితి దారుణంగా మారింది.

అధికారుల నిర్లక్ష్యంతో కుంటుపడిన అభివృద్ధి

గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు



గొల్లప్రోలులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు

పిఠాపురం: అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడిందని అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎనుకోబడిన ప్రజాప్రతినిధులను అగౌరవపరచేలా వ్యవహరిస్తున్నారని ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నారని గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు ఆరోపించారు. ఆమె మంగళవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత మూడేళ్లగా గొల్లప్రోలు నగర పంచాయతీ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానన్నారు. ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించానని ఆమె తెలిపారు. అయితే గత కొంత కాలంగా పరిపాలనా పరమైన అంశాలు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తన దృష్టికి రావడం లేదన్నారు. ఈ విషయాలు అధికారుల దృష్టికి వెళ్లడం వల్ల వారు ఆయా సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. దీంతో సమస్యలు మరింత జటిలంగా మారుతున్నాయని తద్వారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల ఎదురవుతున్న సమస్యలకు పూర్తి నైతిక బాధ్యత అధికారులే వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వైఎస్సార్ సీపీ నేత గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండురంగని కల్యాణం



సామర్లకోటలో పాండు రంగ స్వామి ఆలయం



పాండురంగస్వామి వారు

సామర్లకోట: సుమారు 190 ఏళ్ల పురాతన పాండురంగ ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఆషాఢం తొలి ఏకాదశి నాడు రుక్మిణీ సమేత పాండురంగడి కల్యాణం నిర్వహిస్తారు. పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల కూడలిలో ఉన్న ఈ ఆలయం వద్ద ఈ సందర్భంగా తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. సామర్లకోటకు చెందిన అయోధ్యల కాటయ్య నాయుడు తన పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో స్వామి, అమ్మవారి విగ్రహాలు లభ్యమవడంతో వారి సొంత స్థలంలోనే కల్యాణం నిర్వహిస్తుంటారు. వంశ పారంపర్యంగా అయోధ్యల రాజేశ్వరరావు ధర్మకర్తలుగా ఆలయ నిర్వాహణ చేస్తూ ఉత్సవాలకు భారీ విద్యుదలంకరణలు చేశారు.